ప్రజాశక్తి

శుక్రవారం 17 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

చెరువు సుందరీకరణ జరిగేనా?

విడతల వారీగా మంజూరైన రూ.కోట్ల నిధులు నీరుగారుతున్నట్టేనా?

ఏళ్లు గడుస్తున్నా సుందరీకరణకు నోచుకోని చిట్టివలస, చిల్లపేట పెద్ద చెరువు ఇదే...

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు చిట్టివలస, చిల్లపేట పెద్ద చెరువు అభివృద్ధి పనుల్లో ఎడతెగని జాప్యం నెలకొంది. దుర్వాసన వస్తుందని స్థానికులు, పరిసర ప్రాంత ప్రజలు జివిఎంసి అధికారులకు ఫిర్యాదులు చేయడం పరిపాటిగా మారింది. ఫిర్యాదులు అందిన వెంటనే జోనల్ అధికారులు చెరువును సందర్శించడం, పూడిక తీత పనులు చేపట్టడం షరా మామూలుగానే సాగుతోంది. గత కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. చెరువు అభివృద్ధి జాడ లేదు. సుందరీకరణ ఊసే లేదు. తమకు ఓట్లేసి గెలిపిస్తే చెరువును హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో సుందరీకరణ చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇస్తూనే అన్నారు. శిలా ఫలకాలు వేస్తూనే ఉన్నారు. చెరువు అభివృద్ధి మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు' ఉందని చెప్పొచ్చు.

నాడు పంట భూములు.. నేడు ప్లాట్లు...

కారణాలు ఏమైనా గానీ ఒకనాడు ఆహార పంటలు పండించే పంట భూములు స్థానంలో నేడు ప్లాట్లు ఏర్పడి బహుళ అంతస్తుల భవనాలు ఇబ్బడి ముబ్బడిగా నిర్మితమై ఉన్నాయి. 36 ఎకరాల చెరువు గర్భం, 94 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువు కింద ఒకప్పుడు 26 ఎకరాల్లో వరి, 8 ఎకరాల్లో కొబ్బరి, మరో 8 ఎకరాల్లో సరుగుడు సాగు చేసేవారమని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం నాలుగెకరాల విస్తీర్ణంలో నీరు నిల్వ ఉన్నట్లుగా చెబుతున్నారు. చెరువుకు ఉన్న మూడు మదుముల్లో రెండింటిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ సొంత ప్రయోజనాల కోసం మూసేసారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో చెరువులోని నీరు బయటకు వెళ్లే వీలు లేకపోవడంతో నెలల తరబడి మురిగి పోయి దుర్వాసన వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అటు సంగివలస మొదలు చిట్టివలస, తగరపువలస చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా నిర్మితమైన భవనాల్లోంచి వాడుక నీరు కాల్వల ద్వారా చెరువుల్లో చేరిపోయి నిల్వ ఉండడంతో దుర్వాసన సమస్య మరింత తీవ్రంగా ఉందని స్థానికులు అంటున్నారు.

సుందరీకరణ శిలాఫలకాలకే పరిమితం

36 ఎకరాలు ఉండాల్సిన చెరువు గర్భం విస్తీర్ణం గణనీయంగా తగ్గుతూవస్తోంది. అయిన సరే పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. సుందరీకరణ అంటూ హడావిడి మాత్రం చేస్తున్నారు. హైదారాబాద్ ట్యాంక్ బండ్ తరహా అభివృద్ధి చేస్తామంటూ అధికారంలో ఉన్న టిడిపి, వైసిపి ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి, నిధులు మంజూరు చేసి, శంకుస్థాపనలు చేసినా పనుల్లో పురోగతి కనిపించలేదు. గత టిడిపి మిగతా 2లో..

సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

సముద్ర తాబేళ్ల సంరక్షణలో భాగస్వామ్యం

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలు, సుస్థిర చేపల వేట విధానాలపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, అటవీశాఖ, మత్స్యశాఖ, మెరైన్ పోలీసు, కేంద్ర మత్స్య సంస్థలైన సిఎంఎఫ్ఆర్ఐ, సిఐఎఫ్‌టి, ఎంపిఇడిఎ, ఎఫ్ఎస్ఐ శాస్త్ర వేత్తలు, ఫిషింగ్ బోటు యజమానుల సంఘ ప్రతినిధులు, బోటు యజమానులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, సముద్ర తాబేళ్లు సముద్ర వాతావరణ పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తాయని, తాబేళ్ల పరిరక్షణకు అందరి సహకారం అవసరమని చెప్పారు. సాధారణంగా ఆడ తాబేళ్లు ఏటా నవంబరు, ఫిబ్రవరి నెలల మధ్యలో సముద్రంలో కొన్ని వందల మైళ్లు ప్రయాణించి సముద్ర తీరప్రాంతానికి గుడ్లు పెట్టడానికి వస్తాయన్నారు. బీచ్‌లో గుడ్లు పెట్టిన అనంతరం ఆడ తాబేళ్లు మరలా సముద్రంలోకి వెళ్లి పోతాయన్నారు. గుడ్లు పొదిగిన తరువాత వచ్చే పిల్లలు సముద్రంలోకి చేరుతాయన్నారు. ఇటీవల కాలంలో సముద్ర తాబేళ్ల మృత కళేబరాలు తీరానికి చేరడం గమనిస్తున్నామన్నారు. భవిష్యత్తులో "ఆలీవ్ రిడ్లే" రకపు తాబేళ్ల జాతి సంఖ్య తగ్గడం, అంతరించే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తాబేళ్ల సంరక్షణకు ట్రాల్ నెట్‌లో "టిఇడి "(తాబేల్లు తప్పించే పరికరం) పరికరాన్ని వినియోగించడం ద్వారా తాబేళ్ల బతికి ఉన్నప్పుడు తప్పించుకొనే అవకాశం ఉంటుందన్నారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సముద్రంలో పడ వేయకుండా ప్రతి ఫిషింగ్ బోటు నందు ఇక డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకొని వ్యర్థాలను 'బిన్'లో వేసి ఒడ్డుకు తీసుకురావాలన్నారు. తీరంలో తాబేళ్ల గుడ్లు పెట్టే ప్రదేశాలను రక్షించడానికి మత్స్యకారులు ప్రజలు మత్స్యశాఖ, అటవీశాఖ సహకరించాలన్నారు.

ఇటీవల కాలంలో ఫిషింగ్ బోట్లుకు ప్రకాశవంతమైన "లైట్స్" మిగతా 2లో..

నవోదయ ప్రవేశ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

▶ వార్త 2లో..

విజికె.మూర్తి మరణం ఉద్యమాలకు తీరని లోటు

▶ వార్త 2లో..

ఎఎంసికి హేతువాది ఎంవివి పార్థివ దేహం అప్పగింత

▶ వార్త 2లో..

దేశవ్యాప్త ఉద్యమంతోనే విశాఖ ఉక్కు పరిరక్షణ

▶ వార్త 4లో..

సరుకు లోడింగ్‌లో ఈస్ట్ కోస్ట్ రైల్వే రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : 2024-25 ఆర్థిక సంవత్సరంలో 290 రోజుల్లోనే 2003 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్ చేయడం ద్వారా ఈస్ట్ కోస్ట్ రైల్వే గత రికార్డులను బద్దలు కొట్టిందని రైల్వే అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. దేశంలోని ఏ రైల్వే జోనూ సాధించని విధంగా 2025 జనవరి 15 నాటికి ఈ మైలు రాయిని చేరుకుందని పేర్కొన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే 2023- 24 ఆర్థిక సంవత్సరంలో ఇదే మైలురాయిని చేరుకోవడానికి 295 రోజులు పట్టగా, ఈ ఏడాది 5 రోజుల ముందుగానే ఆ మైలురాయిని అందుకుందని తెలిపారు. గతంలో 200 మెట్రిక్ టన్నుల సరుకు లోడింగ్‌కు 300 రోజులు పైనే పట్టేదని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే 1.6 శాతం సరుకు రవాణా పెరిగిందని తెలిపారు. ఈ రవాణాలో 119.637 మెట్రిక్ టన్నుల బొగ్గు, 7.67 మెట్రిక్ టన్నుల ఉక్కు కర్మాగారాలకు ముడిసరుకులు, 15.991 మెట్రిక్ టన్నుల పిగ్ ఐరన్ అండ్ ఫినిష్డ్ స్టీల్, 24.426 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం, 0.88 మెట్రిక్ టన్నుల సిమెంట్, 2.226 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు, 5.477 మెట్రిక్ టన్నుల ఎరువులు, 2.317 మెట్రిక్ టన్నుల మినరల్ ఆయిల్, 4.372 మెట్రిక్ టన్నుల సరుకులు రవాణా జరిగినట్లు వివరించారు. ఈ సరుకు రవాణా ద్వారా ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆదాయం రూ.20.288 కోట్లు ఆదించిందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 1.28 శాతం అధికంగా ఉందని పేర్కొన్నారు.

ఈ విజయంలో పలు అంశాలు కీలకపాత్ర పోషించాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ తెలిపారు. ప్రధానంగా డబ్లింగ్ మూడు, నాలుగవ లైన్ ప్రాజెక్ట్‌లతో కొత్త రైలు మార్గాల నిర్మాణం, కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల ద్వారా పరిశ్రమలను- ఒడరేవులను అనుసంధానం, కీలకమైన సరుకు రవాణా కేంద్రంగా జోన్‌ను బలోపేతం చేయడం, సకాలంలో సరుకు రవాణా, పరిశ్రమలతో నిరంతరం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడం వంటి అంశాలు కీలక పాత్ర పోషించాయని వివరించారు.

ప్రారంభానికి సిద్ధం

రూ.7 కోట్లతో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ఆధునికీకరణ

ప్రారంభానికి సిద్ధమైన ఇందిరా ప్రియదర్శిని స్టేడియం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 35వ వార్డు పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ఆధునీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరిన స్టేడియాన్ని ఆధునీకరించాలని జివిఎంసి నిర్ణయించింది. 2023లో రూ.5 కోట్లతో ఆధునీకరణకు ప్రతిపాదించి, అదే ఏడాది నవంబర్ నెలలో జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి ఆధునీకరణ పనులు సాగుతూనే ఉన్నాయి. దాదాపు 15 మాసాలపాటు పనులు సాగటం వల్ల, నిర్మాణ వ్యయం పెరిగింది. కొన్ని కొత్త హంగులు ఏర్పాటు చేయటం వల్ల కూడా ఖర్చు పెరిగిందని తెలిసింది. దీంతో మొత్తం ఆధునీకరణ పనులు పూర్తి కావటానికి రూ.7 కోట్లు అవుతుందని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. అనుకున్న విధంగా పనులన్నీ పూర్తయితే ఈ స్టేడియానికి పూర్వ వైభవం లభించడమే కాకుండా, నగరానికి ఒక ల్యాండ్ మార్క్ వర్క్‌గా ఉండే అవకాశం ఉంది.

ఆధునీకరణలో భాగంగా స్టేడియం చుట్టూ ఉన్న వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. ప్రేక్షకులు కూర్చోవడానికి వీలుగా బల్లలు (గ్యాలరీ) ఏర్పాటు చేసి, రంగులతో అందంగా తీర్చిదిద్దారు. బిటి రోడ్లు, కాలువలను నిర్మించారు. డ్రెస్సింగ్ రూమ్స్ ఆధునీకరించారు. అదనంగా గదులు నిర్మించి, మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించారు. స్టేడియం ప్రవేశం వద్ద భవనాలను అందంగా తీర్చిదిద్దారు. ఇక్కడ పార్కింగ్ వగైరా సదుపాయాల కోసం విశాలమైన తారు రోడ్లను నిర్మించారు. ఇదే ప్రాంతంలో చక్కటి పార్కు నిర్మించారు. ప్రవేశం ప్రాంతంలోనే అథ్లెటిక్స్ కోసం కొత్తగా నెట్‌లు ఏర్పాటుచేసి రెండు గ్రౌండ్లు నిర్మించారు. అందమైన అద్దాలతో ఫెవిలియన్ భవనం నిర్మించారు. గోడలకు వివిధ క్రీడా దిగ్గజాల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

చెరువు సుందరీకరణ జరిగేనా?

హయంలో రూ.1.98 కోట్లు నిధులు మంజూరు కాగా, అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు 2018 డిసెంబర్ 1న శంకుస్థాపన చేశారు. చెరువు అభివృద్ధి అంటూ హడావిడి చేసినా పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. చెరువు చుట్టూరా గట్టు పటిష్టం చేశారు.

వైసిపి అధికారంలోకి వచ్చాక రూ.6.50 కోట్లతో పునరుద్ధరణ పనులు పేరిట అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 2023 జులై 1న శిలాఫలకం వేశారు. కొంత మేరకు చెరువు గట్టు పటిష్ట వంతం పనులు చేపట్టారు. అనంతరం పలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. చెరువు అభివృద్ధి కోసమని ప్రభుత్వాలు మారినప్పుడల్లా మంజూరవుతున్న నిధులు ఏమౌతున్నట్లు అన్న సందేహం సర్వత్రా నెలకొంది.

సముద్ర తాబేళ్ల సంరక్షణలో భాగస్వామ్యం

అమర్చి చేపల వేట చేయడం వల్ల సముద్ర ఆవరణ వ్యవస్థ ప్రభావితమై మత్స్య సంపద తగ్గిపోయి మత్స్యకారుల జీవనోపాధి కుంటుపడే అవకాశం ఉన్నందున "లైట్స్" ఉపయోగించి చేపల వేట చేయరాదని మత్స్యకారులకు తెలిపారు. తాబేళ్లకు నష్టం వాటిల్లే వలలు, వేట పద్ధతులపై అవగాహన కల్పించాలని, ప్రత్యామ్నాయ వేట పద్దతులపై దృష్టి సారించాలని, టెడ్ పరికర వినియోగం డెమోలు ఏర్పాటుచేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంలో మత్స్యకారులు, ప్రజలు ప్రభుత్వంతో సహకరించాలన్నారు. సముద్రంలో ప్లాస్టిక్ చేరడం వల్ల మత్స్యసంపదపై ప్రభావం చూపి మత్స్యకారుల జీవనోపాధి కుంటుపడుతుందన్నారు. ఫిషింగ్ బోట్లపై, ఫిష్ మార్కెట్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ జిల్లా అధికారి శ్రీవాణి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, కేంద్ర మత్స్య సంస్థల ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్ కిజాకుద్దీన్, ఎఫ్ఎస్ఎల్ జోనల్ డైరెక్టర్ భామి రెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, మెరైన్ సిఐ దివాకర్,ఎడి. విజయ కృష్ణ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం

చిత్రాలను అలంకరించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. మూడు షిప్టుల్లో స్టేడియాన్ని కాపాడటం కోసం, కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించారు. ఈ సరికే నగరానికి చెందిన ఔత్సాహిక క్రీడాకారులు స్టేడియంలో వివిధ క్రీడల పోటీలను నిర్వహిస్తున్నారు. ఆర్మీ సెలక్షన్స్ కోసం ర్యాలీలు ఇదే స్టేడియంలో ఏర్పాటుచేస్తున్నారు.

ఎన్‌టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా 1987లో ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియాన్ని ప్రారంభించారు. రూ.25 వేలమంది ప్రేక్షకులు కూర్చునే విధంగా సీటింగ్ కెపాసిటీతో నిర్మాణం జరిగింది. ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్ పోటీలు ఇదే స్టేడియంలో జరిగాయి. 1988 నుంచి 2001 సంవత్సరాల మధ్య ఐదు వన్ డే క్రికెట్ పోటీలకు ఈ స్టేడియం ఆతిథ్యం కల్పించింది. 1996లో ఆస్ట్రేలియా కెన్యాల మధ్య ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్ ఇక్కడే జరిగింది. పిఎం.పాలెంలో డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ విడిసిఎ స్టేడియం నిర్మాణం జరిగి, అందుబాటులోకి వచ్చిన తర్వాత, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నిర్లక్ష్యానికి గురైంది. ఎట్టకేలకు మళ్లీ ఇప్పుడు ఈ స్టేడియానికి పూర్వ వైభవం రావడం పట్ల, క్రీడాకారులు, క్రీడాభిమానులు, నగర ప్రజలు హర్షం వ్యక్తపరుస్తున్నారు.

విజికె.మూర్తి మరణం ఉద్యమాలకు తీరని లోటు

విజికె.మూర్తి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న లోకనాథం, ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అభ్యుదయ సాహిత్యవాది, వామపక్ష మేధావి, ప్రముఖ కార్మిక నాయకులు విజికె.మూర్తి ఆకస్మిక మరణం వామపక్ష ఉద్యమానికి, కార్మిక లోకానికి తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. విజికె.మూర్తి మృతిచెందిన విషయం తెలియడంతో లోకనాథం, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, సిహెచ్.సుమిత్ర శ్రీకాకుళం వెళ్లి ఆయన పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్ఐసి ఉద్యోగిగా, ఆ ఉద్యోగుల సంఘం నాయకునిగా మూర్తి పనిచేశారని చెప్పారు. 1992లో సిఐటియు శ్రీకాకుళం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షునిగా, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యునిగా, జ్యూట్, శ్యాం పిస్టన్ కార్మిక ఉద్యమాల ద్వారా నిబద్ధత కలిగిన నాయకునిగా గుర్తింపు పొందారని కొనియాడారు. అభ్యుదయ సాహిత్యం పట్ల అమిత అభిలాష కలిగిన వ్యక్తి మూర్తి అన్నారు. శ్రీకాకుళంలో గరిమెళ్ళ విజ్ఞి నాని కేంద్రం జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తూ ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారని చెప్పారు.

విజికె.మూర్తి మరణం అభ్యుదయ ఉద్యమాలకు తీరని లోటు అని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంఎస్.వాసా, ఉపాధ్యక్షులు కె.విజయ గౌరి, బిబి.గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షులుగా ఉంటూ ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పెండింగ్ నీటి ప్రాజక్టుల నిర్మాణం, ఉద్దానం కిడ్నీ వ్యాధి, ఎచెర్లలో ఐఐఐటి తరగతుల ప్రారంభం వంటి అనేక సమస్యల పరిష్కారానికి, ఈ ప్రాంత ప్రజల మద్దతు కూడగట్టడానికి నిత్యం ప్రయత్నిస్తూనే ఉండేవారని గుర్తుచేశారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18వ తేదీన జరగనున్న పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాలలో పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో గురువారం తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా పక్కా ఏర్పాట్లుచేయాలని సూచించారు.

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 39 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జవహర్ నవోదయ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ఎస్.చంద్రశేఖర్ చెప్పారు. 9,080 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. మూడు జిల్లాలకు చెందిన పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్‌లకు, పరిశీలకులకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శిక్షణ కూడా అందజేసినట్లు వివరించారు. పరీక్ష శనివారం ఉదయం 11.30 నుంచి 1.00 గంట వరకు ఉంటుందని తెలిపారు.

నవోదయప్రవేశ పరీక్షపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ఎయు భూములను కాపాడండి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీలో అన్యాక్రాంతమవుతున్న భూములను పరిరక్షించాలని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ ఆలుమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్ సారథ్యంలో గురువారం ఎయు రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, ఆక్రమణకు గురవుతున్న ఎయు భూములను కాపాడాలని, ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ సమీపంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను తక్కువ అద్దెకు తీసుకుని యూనివర్సిటీ ఆదాయానికి గండి కొడుతున్న రాజారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెక్టార్‌ను కలిసిన వారిలో సొసైటీ కార్యదర్శి ఆరేటి మహేష్‌బాబు, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ శిరీష్ కుమార్, డాక్టర్ బి.సురేంద్రబాబు తదితరులు ఉన్నారు.

పట్టణ ప్రణాళిక విభాగంపై నేడు ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి పరిధిలో ప్రతి శుక్రవారమూ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులను, వినతులను స్వీకరిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జివిఎంసిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి అధికంగా ప్రజల నుంచి ఫిర్యాదులు/వినతులు వస్తున్నాయని కమిషనర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేకంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫిర్యాదులు, వినతులు స్వీకరిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంసికి హేతువాది ఎంవివి పార్థివ దేహం అప్పగింత

రచయిత ఎంవివి సత్యనారాయణ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ రచయిత, హేతువాది, సామాజిక కార్యకర్త, శరీర, అవయవదాన ఉద్యమకారుడు ఎంవివి సత్యనారాయణ (76) బుధవారం గుండె పోటుతో మరణించడంతో ఆయన పార్థివదేహాన్ని గురువారం ఆంధ్రమెడికల్ కాలేజీకి అప్పగించారు. రవళి పత్రికకు రాస్తున్న 'ప్రమాదం అంచులో' సీరియల్ భాగం పూర్తి చేసస్తానే, మిత్రులతో ఫోన్ సంభాషణలు చేసస్తూ ఆకస్మికంగా మరణించడంతో విశాఖ సాహితీ లోకంలో విషాదం చోటు చేసుకుంది. ఆయన కోరిక మేరకు అతని భార్య సత్యవతి, కుమార్తెలు శిరీష, సౌజన్య, కుటుంబ సభ్యుల సహకారంతో సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన స్పెక్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి ఆంధ్రా మెడికల్ కాలేజీకి పార్థివదేహాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా శరీర అవయవ దాతల సంఘం సభ్యులు టి.శ్రీరామమూర్తి, జె.రాంప్రభు, పీలా హరిప్రసాద్, మంతెన వెంకటరాజు, డి.విజ్ఞానంద్ పాల్గొన్నారు.

అందాల కథానాయకుడు శోభన్‌బాబు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తెలుగువారి అందాల నటుడు శోభన్ బాబు అని జనసేన మహిళా నాయకులు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ రూప అన్నారు. శోభన్‌బాబు 89వ జయంతిని డాబాగార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్ క్లబ్ ఎదురుగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూప కేక్ కట్ చేశారు. శోభన్‌బాబు పేరుతో తయారుచేసిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా శోభన్ బాబు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పౌరాణికం, సాంఘిక చిత్రాలలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న శోభన్ బాబు లేని లోటు సినీ రంగంలో కొనసాగుతోందన్నారు. శోభన్ బాబు సిటీ వైడ్ ఫ్యాన్స్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో శోభన్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

డీహైడ్రేషన్‌కు 'డబ్ల్యుహెచ్ఒ ఒఆర్ఎస్'తో ఉపశమనం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : డయేరియా కారణంగా వచ్చే డీహైడ్రేషన్‌కు 'డబ్ల్యుహెచ్ఒ ఒఆర్ఎస్'తో ఉపశమనం లభిస్తుందని కెన్‌వ్యూ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ ఆనందని మీడియాకు తెలిపారు. డయేరియా రోగుల్లో డీహైడ్రేషన్‌ను తరిమి కొట్టడమే లక్ష్యంగా 'డబ్ల్యుహెచ్ఒ ఒఆర్ఎస్' విడుదల చేశామన్నారు. ఇది శాస్త్రీయ ఆధారాలతో, నిపుణుల సిఫార్సులతో తయారు చేశామన్నారు. ఈ కొత్త ఉత్పత్తి యాపిల్, ఆరెంజ్ రుచులలో లభ్యమవుతుందని పేర్కొన్నారు. శాస్త్రీయంగా తయారైన ఫార్ములాతో ఇరవై సంవత్సరాలుగా రెడీ-టు-డ్రింక్ ఎలక్ట్రోలైట్ కేటగిరీని ముందుకు తీసుకెళు న్నామన్నారు.

జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో 8 మంది స్టాండింగ్ కౌన్సిల్స్‌ను నియమించేందుకు న్యాయవాదుల నుండి దరఖాస్తులు స్వీకరించే తేదీని పొడిగించినట్లు కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ గురువారం తెలిపారు. 8 మంది న్యాయవాదులు నియామకానికి దరఖాస్తు గడువు ఈ నెల 6వ తేదీతో ముగియడంతో మరలా ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరిలో -4, వెనుకబడిన తరగతి గ్రూపు (ఎ)-1, ఎకనామికల్ వీకర్ సెక్షన్స్-1, ఎస్‌టి-1, వెనుకబడిన తరగతుల గ్రూపు (బి)-1 భర్తీ చేయనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్‌లో కనీసం 10 సంవత్సరాల మెంబర్‌గా రిజిస్ట్రేషన్ అయి ఉన్న వారు మాత్రమే అర్హులని తెలిపారు.

19 నుంచి కేరళ ఆయుర్వేదం శిబిరం

ప్రజాశక్తి-విశాఖపట్నం : దీర్ఘకాల రోగాలకు ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా చికిత్స అందించేందుకు ఈ నెల19 నుంచి 23వ తేదీ వరకు కేరళ వైద్యులచే ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నేను **పూజారి జనార్ధనమ్మ,** భర్త మల్లేశ్వరరావు, డో.నెం.55-5-13/1, ఉమానగర్, హెచ్.బి.కాలనీ, విశాఖపట్నం. నాకు సంబంధించిన డాక్యుమెంట్స్ **(1) డాక్‌మెంట్ నెం. 42/1998 (2) డాక్‌మెంట్ నెం.758/1988** (Sale Deed and Other Documents) విశాఖపట్నం జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో పోయినవి. సదరు డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు.

సెల్ : 79891 64523

పునాదుల్లోనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి!

- 16ఏళ్లుగా ముందుకు కదలని పనులు
- పాతగాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టని వైనం
- అధికారులు, పాలకుల నిర్లక్ష్యంపై జనం ఆగ్రహం

పాత గాజువాక జంక్షన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పునాదులు

ప్రజాశక్తి -గాజువాక : పారిశ్రామికంగా పురోగమిస్తున్న గాజువాకలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ట్రాఫిక్ కష్టాలను అధిగమించేందుకు ప్రభుత్వాలు, అధికారులు చేపట్టే చర్యలు కాగితాలు, ప్రతిపాదనలకే పరిమితమౌతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్నట్లు ఉండే పాతగాజువాక జంక్షన్‌లో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులను పెట్టుకొని, ఇక్కడ రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టే చర్యల్లో భాగంగా 2008లో గాజువాకలో జాతీయ రహదారి వెంబడి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆర్అండ్‌బి, నేషనల్ హైవే అధికారులు ప్రతిపాదనలు చేశారు. అయితే ఇది భారీ ప్రాజెక్టు కావడం, నిధులు సమస్య రావడం, అంత మొత్తంలో నిధులు కేటాయించే స్థాయి అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి లేదని భావించి, ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ఈ జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు 2009లో రూ.10 లక్షలతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని భావించారు.

దీనికి సంబంధించి అనుమతులు, నిధులు మంజూరు కావడంతో అప్పట్లో పాతగాజువాక జంక్షన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతోపాటు పునాదుల వరకు పనులను కూడా చకచకా చేపట్టారు. అయితే నిధులు చాలక పోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిపేశారు. తర్వాత అదనపు నిధులు మంజూరుగానీ, ఇతరత్రా చర్యలు గానీ లేకపోవడంతో అప్పటి నుంచి ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వాయిదా పడుతూ వచ్చి, దాదాపు 16 ఏళ్లు గడిచినా నేటికీ ముందుకు సాగని పరిస్థితి ఉంది.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారులు

పెరుగుతున్న జనాభా, వాహనాలకు అనుగుణంగా పాతగాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీకూడా విపరీతంగా పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మరింత క్లిష్టంగా మారడంతో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే కొంతవరకైనా ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉందని భావిస్తున్నా, ఆ దిశలో ఒక్కడుగు కూడా ముందుకు పడడం లేదు. దీంతో పాతగాజువాకలో వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే క్రమంలో చిన్నపాటి డిజైన్ మార్పినప్పటికీ, దాని వల్ల వాహనాల రాకపోకలకు కొంచం వెసులుబాటు వచ్చినా, పాదచారుల కష్టాలకు మాత్రం మోక్షం కలగని పరిస్థితి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాతగాజువాకలో ట్రాఫిక్ కష్టాలపై ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి లేకుంటే కనీసం ఫుట్‌ఓవర్. బ్రిడ్జి నిర్మాణంతోనైనా సమస్యకు కొంతవరకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కోసం అక్కిరెడ్డిపాలెం వాసులవినతి

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అక్కిరెడ్డిపాలెం వద్ద కూడా నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. జాతీయరహదారికి రెండువైపులా ఉన్న అక్కిరెడ్డిపాలెం, నాతయ్య పాలెం వద్ద రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన భయంకర పరిస్థితి ఉంది. ఇక్కడా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వెళ్లాలంటే జాతీయరహదారి దాటాల్సిన పరిస్థితుల్లో వారు భయాందోళన చెందు తున్నారు. ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు మూడేళ్లకుపైగా డిమాండ్ చేస్తూ స్పందించే దిక్కులేదు. ఇప్పటికైనా స్థానిక నేతలు, అధికారులు స్పందించాలిన స్థానికులు వేడుకుంటున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అతిక్రమిస్తే చట్టపరమైన కేసులు, చర్యలు తప్పవని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ సూచించారు. గురువారం డైమండ్ పార్క్. అక్కయ్యపాలెం, శంకరమఠం, దొండపర్తి, తదితర ప్రాంతాలలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు లేని పలువురికి తగిన జరిమానాలు విధించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ వాణిశ్రీ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స లేకున్నా, మైనర్లకు వాహనాలిచ్చినా వాహన యజమానులపై కేసులు ఉంటాయన్నారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

6 నుంచి ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదినారాయణ

ప్రజాశక్తి -ఉక్కునగరం : వచ్చేనెల 6 నుంచి నాలుగు రోజుల పాటు శ్రీకాకుళంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ తెలిపారు. గురువారం కూర్మన్నపాలెం ఉక్కు దీక్షా శిబిరం వద్ద దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదినారాయణ ఆవిష్కరించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యా, ఉపాధి ఉద్యోగ, అవకాశాల సాధనకు ఎఐవైఎఫ్ దేశవ్యాప్తంగా పోరు సాగిస్తోంద న్నారు. నిరుద్యోగ సమస్యపై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు కెంగువ అచ్యుతరావు, వై. రాంబాబు, సిపిఐ నాయకులు జి. ఆనంద్, కిరణ్, లక్ష్మి ,రజని, ఉమ పాల్గొన్నారు

తుదిదశకు దుకాణ సముదాయం

నెలాఖరుకు నిర్మాణం పూర్తిచేసేందుకు జివిఎంసి ఇంజినీరింగ్ అధికారుల చర్యలు

నిర్మాణంలో ఉన్న జివిఎంసి షాపింగ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక మెయిన్ రోడ్డు కు అనుకుని జివిఎంసి సాధారణ నిధులు రూ కోటి 50 లక్షలతో నిర్మిస్తున్న దుకాణ సముదాయం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి .దాదాపు 40 ఏళ్ల క్రితం లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్‌లో అప్పటి మున్సిపల్ అధికారులు దుకాణ సముదాయం నిర్మించగా, అప్పటి దుకాణాలు శిథిలావస్థకు చేరడంతో 2021 ఆగస్టు నెలలో వీటిని తొలగించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ముందు దుకాణ సముదాయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.మూడున్నరేళ్లుగా సాగిన నిర్మాణ పనులు ఎట్టకేలకు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరు నాటికి దుకాణ సముదాయ నిర్మాణాన్ని పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలని జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఇక్కడ 11 దుకాణాలతో కూడిన జివిఎంసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- సీతమ్మధార : భీమిలి తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ముస్తఫా గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలివి. సీతమ్మధార ఆర్అండ్‌బి క్వార్టర్స్‌లో భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్న ముస్తఫా, భీమిలి మండలరెవెన్యూ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన ముస్తఫా, పలుచోట్ల అప్పులు చేశాడు. వాటిని తీర్చలేని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న ముస్తఫా, పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ద్వారక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులపై కేసు నమోదు

ప్రజాశక్తి -నక్కపల్లి:సంక్రాంతి పండుగ సందర్భం గా పందెం రాయుళ్లపై కేసులు నమోదు చేసినట్లు సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని నాలుగు రోజుల్లో పేకాట, కోడిపందాల శిబిరాలపై దాడులు చేసి 13 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 8 కేసులు కోడి పందాలు పైన, 5 కేసులు పేకాట రాయుళ్లపైన నమోదు చేశామన్నారు. రూ.25,310 నగదు, 17 కోడిపుంజులు స్వాధీనం చేసుకుని, 35 మందిపై కేసు చేశామని, వీరందరినీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

పోలీసుల అదుపులో బియ్యం అక్రమ రవాణా ముఠా

పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ / కలెక్టరేట్: బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురిని విశాఖపట్నం వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... పోలీస్ కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు పూర్ణామార్కెట్, ఆయిల్ మిల్ సందులో వెంకటేశ్వరరావు పేరు మీద ఉన్న రేషన్ డిపో (0386153)పై వన్‌టౌన్ పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉండాల్సిన బియ్యం కన్నా 48.7 క్వింటాళ్ల బియ్యం (సుమారు 85 బస్తాలు) అధికంగా ఉండటాన్ని గుర్తించారు. అదే సమయంలో సదరు రేషన్ షాప్ యజమాని ఎపి39 టియు 0217 బొలెరో వాహనంలో 13 ప్లాస్టిక్ బస్తాలు పిడిఎస్ బియ్యం రవాణా చేసేందుకు సిద్ధంగా ఉండడాన్ని కూడా గుర్తించారు. కొల్లి లోవరాజు, కర్రి దుర్గారావు, కిల్లి వెంకటరమణ, మునకాల తేజలను అరెస్టు చేశారు. వెంకటేశ్వరరావు పేరు మీద ఉన్న రేషన్ డిపోను సివిల్ సప్లై అధికారులు సీజ్ చేశారు. 6ఏ కేసు నమోదు చేశారు. కాగా వన్‌టౌన్ పోలీసులను సిపి శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

దువ్వాడలో విస్తృత దాడులు : 50 కిలోలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ సామగ్రి

ప్రజాశక్తి -గాజువాక : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జివిఎంసి గాజువాక జోనల్ అధికారులు గురువారం ముమ్మర దాడులు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై సంపూర్ణ నిషేధం అమలు చేస్తున్న నేపథ్యంలో దువ్వాడలో జరిపిన దాడుల్లో 50 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్, స్పూన్స్, తదితర ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ అనిల్, వార్డు శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఉద్యమంతోనే విశాఖ ఉక్కు పరిరక్షణ

- కోల్‌కత్తా స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సమావేశం తీర్మానం
- వివరాలు వెల్లడించిన స్టీల్ ఎంప్లాయిస్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం

మాట్లాడుతున్న అయోధ్యరాం

ప్రజాశక్తి- ఉక్కునగరం : అఖిలభారత సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపుమేరకు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని ఉక్కు పరిశ్రమలలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందనిస్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ అన్నారు.కోల్‌కతాలో స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సమావేశం వివరాలను గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిరంకుశ విధానాలను అత్యంత వేగంగా అమలు చేస్తోందని తపన్‌సేన్ విమర్శించారన్నారు. అందులో భాగంగానే విశాఖ స్టీల్ ప్లాంట్‌లో విఆర్ఎస్ ప్రవేశపెట్టి, ప్రయివేటుకు విశాఖ ఉక్కును కట్టబెట్టే ప్రక్రియను ప్రారంభించిందని స్పష్టం చేశారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తూ, సొంత గనులను కేటాయించినప్పుడే సమస్య పరిష్కారమైనట్లు భావించాలన్నారు. ఒడిశాలోని సెయిల్ ఐరన్ ఓర్‌ను అదాని ప్రైవేటు సంస్థకు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం సాగుతోందన్నారు.. విశాఖ స్టీల్ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇది కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి పరాకాష్ట అని తపన్‌సేన్ భావించారన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని కోల్‌కతా సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు దేశవ్యాప్త ఉద్యమమొక్కటే తక్షణ కర్తవ్యమని, ఆ దిశగా దేశవ్యాప్త ఉద్యమానికి స్టీల్ కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యు రామస్వామి, ఒవి రావు, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

వాలీబాల్ పోటీలను పారంభిస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి జగన్

ప్రజాశక్తి -ఉక్కునగరం : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా జివిఎంసి 87వ వార్డు సీతారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి, వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏటా ఆనవాయితీగా అన్న ఎన్‌టిఆర్ వర్ధంతి, జయంతిలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఈనెల 18న వర్ధంతిని పురస్కరించుకుని వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ఎన్‌టిఆర్ వర్ధంతి రోజున బహుమతులు అందజేస్తామన్నారు. యువత క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు రాజన్ రాజు, బొడ్డ ప్రకాష్, జాన్ రమేష్, జల్లు సత్యనారాయణ, ఆదినారాయణ, దాలయ్య, ఎటిఎస్ మూర్తి, పాల్, కోటేశ్వరరావు, అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

56వ రోజుకు ఎన్ఎడి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- గోపాలపట్నం : తొలగించిన 36 మంది ఎన్ఎడి కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఆరుగురుపై పెట్టిన పోలీస్ కేసును ఉపసంహరించుకోవాలని ఎన్ఎడి సిఐ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎడి సిఐ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన దీక్షలు గురువారానికి 56 రోజులకు చేరుకున్నాయి. కార్మికుల సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా పలు కార్మిక సంఘాలు మద్దతుగా నిలిచాయి.

ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, చట్టసమ్మతం కాని ఓవర్‌టైం డ్యూటీలను వెంటనే నిలిపేయాలని సిజిఎంను కోరారు. 35 మంది కార్మికులకు చార్జిమెమోలు ఇవ్వగా, వారి వివరణ కూడా ఇచ్చారని, ఈ నేపథ్యంలో వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల దీర్ఘకాలిక సస్పెన్షన్లు సంస్థ ప్రయోజనాలకు ఏమాత్రం మంచిది కాదన్నారు. దీనిపై విచారణ జరుగుతున్నందున తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునే అధికారం యాజమాన్యానికి ఉంటుందని, ఈలోగా అందరినీ బాధ్యులను చేస్తూ విధులనుంచి తొలగించడం సమ్మతం కాదని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దీనిపై ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కుమార్ కూడా సిజిఎంకు, కమాండ్ అధికారులకు లేఖ రాసారన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా స్పందించకుంటే, ఎన్ఎడి కార్మికులకు సంఘీభావంగా వస్తున్న స్టీల్ ప్లాంట్, షిప్‌యార్డ్, భెల్ ఇతర సంస్థల కార్మిక సంఘాలను కలుపుకుని ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తిరుపతి ఘటన మేల్కొలుపు కావాలి

ఎపిసిసి ప్రధాన కార్యదర్శి వెంకటరావు

ప్రజాశక్తి- మాధవధార : తిరుపతి ఘటన మహిళలు, నాయకులకు మేల్కొలుపు కావాలని ఎపిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాట ఘటనలో ఐదుగురు మహిళలు చనిపోతే, రాష్ట్రవ్యాప్తంగా అందరూ స్పందించారని, అయితే రాజకీయ పార్టీల మహిళా అధ్యక్షులు మాత్రం స్పందించకపోవడం శోచనీయమన్నారు. మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులతోపాటు బిజెపి బ్రాండ్ అంటున్న మాధవీలత సహా, ఏ పార్టీ నాయకులు దీనిపై స్పందించలేదన్నారు.

మహిళలకు కష్టం వచ్చినప్పుడు, అన్యాయం జరిగినప్పుడు వెంటనే స్పందించడం, బాధితులకు న్యాయం చేసి భరోసానివ్వాల్సిన బాధ్యత వీరికి లేదాయని ప్రశ్నించారు. ఇటీవల సినిమాలు, సినీ ఈవెంట్లలో మహిళల పట్ల చేస్తున్న వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వారధి 'ప్రజాశక్తి'



ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్‌ఒలు

ప్రజాశక్తి - సీతమ్మధార :ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాగా ప్రజాశక్తి తెలుగు దినపత్రిక పనిచేస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి జగదీశ్వరరావు అన్నారు. గురువారం రామాటాకీస్ దరి జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో 2025ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా ప్రజాశక్తి దినపత్రిక కృషి చేస్తోందని కొనియాడారు. రానున్న కాలంలో ప్రజాశక్తి మరింత పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జీవన్ రాణి కూడా పాల్గొన్నారు.

120 మందికి గ్రామ పురస్కార అవార్డులు



పురస్కారాలను స్వీకరించిన విలాస్‌ఖాన్ పాలెం వాసులు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని విలాస్‌ఖాన్ పాలెం గ్రామంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన గ్రామస్తులకు గ్రామ పురస్కార్ అవార్డులతో ఘనంగా సత్కరించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ పండుగ రోజును గ్రామానికే చెందిన 120మందికి వివిధ రంగాలకు సంబంధించి పురస్కారాలను అందజేశారు. వ్యవసాయాభివృద్ధిలో సత్తా చాటిన రామకృష్ణను ఉత్తమ రైతు అవార్డుతో సత్కరించారు. గ్రామం నుంచి ఇటీవల ప్రభుత్వ, ప్రయివేటురంగాల్లో ఉద్యోగాలు పొందిన యువకులకు, ఉన్నత చదువుల్లో సత్తాచాటిన వారిని, గ్రామంలో పనిచేస్తున్న అంగన్వాడీలు, ఆశాలు, పారిశుధ్య కార్మికులు మిడ్డేమీల్ వర్కర్లు ఇలా అన్ని రంగాల వారిని ఒకే వేదికపైకి ఉత్సాహభరిత పండుగ వాతావరణంలో పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఆయా రంగాల్లో వారి సేవలను, ప్రతిభను కొనియాడారు.

ఈ సందర్భంగా కుటుంబానికి భారం లేకుండా ఏదో ఒక ఉద్యోగం చేసుకోవాలని, కుటుంబానికి, గ్రామానికి భారంగా ఏఒక్కరూ మారకూడదని గ్రామపెద్దలు హితవు పలికారు.

క్రీడలు, క్రీడాకారులకు ప్రోత్సాహం

ట్రోఫీ అందజేస్తున్న బోస్

ప్రజాశక్తి-ఆనందపురం: క్రీడలు, క్రీడాకారులకు తనవంతుగా ప్రోత్సాహిస్తూ పలువురి ప్రశంసలు, అభినందనలు అందుకుంటున్నారు మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్. మండలంలోని ముచ్చర్ల గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలలో క్రీడాకారులకు రూ.50 వేలతో క్రీడ దుస్తులు, మెమెంటోలు అందజేసి ప్రోత్సాహించారు.

ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల్లో రాణించాలన్నారు క్రీడలతో పాటు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంక అప్పలనారాయణ, గిడిజాల మాజీ సర్పంచ్ కోరాడ రాము, శినగం శివ, చిన్నయ్య అప్పలనారాయణ, శివాజీ పాల్గొన్నారు

శిల్పారామం జాతరలో ముగిసిన సంక్రాంతి సంబరాలు

నృత్యాలు చేస్తున్న కళాకారులు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు గురువారంతో ముగిసాయి. ముగింపురోజున గురువారం సాయంత్రం మీనాక్షి కూచిపూడి డాన్స్ అకాడమీ కళాకారుల ఆధ్వర్యంలో జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా సంక్రాంతి వచ్చిందమ్మా తుమ్మెద, తమిళమైన పదం, అమ్మవారి స్తుతి, వేయి నామాల సామీ, లవకుశ తదితర గేయాలకు బిందుశ్రీ, భవ్య, దీక్షిత, వీషిక, మన్విత, సంకీర్తన, శరణ్య, సాక్షిత, ఉజ్వల చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలనాధికారి టి. విశ్వనాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.

ముగిసిన పిపిఎల్ క్రికెట్ టోర్నీ

విజేతగా పవర్ పాంథర్స్ జట్టు

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని పాలవలస పంచాయతీలో సంక్రాంతి సందర్భంగా పిపిఎల్ సీజన్ 3 క్రికెట్ పోటీలు గురువారంతో ముగిసాయి. టోర్నీ ఫైనల్ పోటీలో పవర్ పాంథర్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు నగదు బహుమతులను మద్ది శేఖర్ అందజేయగా, ట్రోఫీని. రెడ్డి మహేష్, నిమ్మల అప్పలరాజు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగోతి నర్సమ్మ, పాలవలస రమేష్, ఎంపిటిసి రౌతు. వెంకటరావు, పాలవలస సురేష్, కెప్టెన్ శ్రీనివాసరావు, బూర్లె చిన్న నాయుడు, దుక్క వెంకటరావు, రౌతు రమణ, సిహెచ్ శ్రీను పాల్గొన్నారు.

విహారంలో విషాదం

- జలపాతంలో తలకు రాయి తగిలి యువకుడు మృత్యువాత
- అందివచ్చిన కొడుకు అర్ధాంతరంగా తనువు చాలింపు
- దు:ఖసాగరంలో కుటుంబం
- శోకసంద్రంలో ఎన్.గజపతినగరం
- గ్రామదేవత పండగ నిలుపుదల

ప్రజాశక్తి-దేవరాపల్లి

స్నేహితులతో కలిసి సరదాగా విహారానికి వెళ్లిన ఓ యువకుడిని జలపాతం అమాంతంగా మింగేసింది. అప్పటి వరకు మిత్రులతో కేరింతలు కొట్టిన అతని గొంతు శాశ్వతంగా మూగబోయింది. సంక్రాంతి పండగతో పాటు గ్రామ దేవత తీర్థంలో సందడి చేద్దామనుకొని వచ్చిన ఆ యువకుడి ఆనందం అంతలోనే ఆవిరైంది. జలపాతంలో దూకినప్పుడు తలకు రాయి తగిలి ఆ యువకుడు మృత్యువాతకు గురయ్యాడు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామమంతా శోకసంద్రంలో మునిగింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి...

దేవరాపల్లి మండలం ఎన్.గజపతినగరం గ్రామానికి చెందిన వంటాకు శ్రీధర్ జీవనోపాధి కోసం విశాఖపట్నం వెళ్లి, భార్య లక్ష్మి, కుమారుడు వంటాకు శ్యాంప్రసాద్ (21)తో కలిసి పట్టాభిరెడ్డి గార్డెన్లో నివాసముంటున్నారు. శ్రీధర్ జీవీఎంసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. సంక్రాంతి పండగతో పాటు ముక్కనుమ నాడు జరిగే గ్రామదేవత తీర్థం నిమిత్తం కుటుంబం మొత్తం మంగళవారం తమ స్వగ్రామం ఎన్.గజపతినగరం వచ్చారు. బుధవారం కనుమ పండగ అయిన తరువాత శ్యాంప్రసాద్ తమ గ్రామానికి చెందిన సుమారు 20 మంది స్నేహితులతో కలిసి పాడేరు మండలం ఐనాడ పంచాయతీ గుల్లి గిరిజన గ్రామ సమీపంలోని జలపాతం చూడటానికి వెళ్లారు. కొంత సేపు సరదాగా జలపాతంలో కేరింతలు కొట్టిన తరువాత శ్యాం ప్రసాద్ పై నుండి జలపాతంలోకి దూకాడు. ఆ సమయంలో జలపాలంలో ఉన్న రాయి శ్యాం ప్రసాద్ తలకు తగలడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.

శ్యాం ప్రసాద్ (ఫైల్‌ఫొటో)

ఉద్యోగంలో చేరి రెండు నెలలు..

నిరుపేద కుటుంబానికి చెందిన శ్యాం ప్రసాద్ డిగ్రీ చదివారు. తమ స్వగ్రామంలో వృద్ధాప్యంలో ఉన్న తాతయ్య, నాన్నమ్మను శ్యాంప్రసాద్ ప్రతి వారం పరామర్శించి వారికి కావలసిన సరుకులు ఇచ్చేసి రెండు రోజులు వారితో గడిపి విశాఖ వెళ్లే వాడు. రెండు నెలల క్రితమే శ్యాం ప్రసాద్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. తండ్రి అరకొర జీతానికి కుమారుడి జీతం కూడా తోడై ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని ఆ కుటుంబం భావిస్తున్న సమయంలో శ్యాం ప్రసాద్ మృత్యువాతకు గురయ్యాడు.

వంటాకు శ్యాం ప్రసాద్ మృతదేహం

దు:ఖసాగరంలో కుటుంబం

శ్రీధర్ ఇద్దరు బిడ్డల్లో వికలాంగుడైన ఒక కొడుకు ఇటీవలే మృతి చెందాడు. ఆ దు్ఖం నుండి తేరుకోక ముందే ఎదుగొచ్చిన మరో కొడుకు ఇలా జలపాతంలో పడి మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా ఏడ్చారు. తనకు తలకొరివి పెడతాడనుకున్న కొడుకు చితికి తాను నిప్పంటించాల్సి వస్తుందని తానెనాడూ ఊహించలేదంటూ తండ్రి శ్రీధర్ రోధించాడు. అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసిన ఇద్దరు కొడుకులు లేకుండా తామెవరి కోసం బతకాలంటూ తల్లిదండ్రులు శ్రీధర్, లక్ష్మి బోరున విలపించగా, వారిని ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు. ఆ కుటుంబం మొత్తం తీవ్ర దు:ఖసాగరంలో మునిగిపోయింది.

గ్రామంలో విషాదఛాయలు

శ్యాం ప్రాసాద్ మృతి చెందాడన్న విషాద వార్త ఎన్.గజపతినగరం గ్రామస్తులను తీవ్రంగా కలచి వేసింది. ఆ గ్రామం మొత్తం శోక సంద్రంలో మునిగిపోయింది. గురువారం జరగాల్సిన గ్రామదేవత తీర్థాన్ని నిలుపుదల చేసి, శ్యాంప్రసాద్ అంతిమ సంస్కారాల్లో గ్రామస్తులంతా పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న పీలా తదితరులు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే సీఎం సహాయనిధి లక్ష్యమని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం అనకాపల్లి నియోజకవర్గంలో ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన 3 లక్షల 90 వేలు రూపాయిల చెక్కులను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజె కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీతో కలిసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు వైద్యం చేయించుకున్న పేదలు నియోజకవర్గానికి చెందిన అల్లుమళ్ళ రమేష్‌కి రూ.58,824, కొణతాల కుమార్‌రావుకి రూ.1,19,902, బొబ్బర దేముడుకు రూ.37,600, జె.సూరిబాబుకు రూ.1,13,505, కోసిరెడ్డి నల్లమరి లక్ష్మికి రూ.30,786, సేనాపతి రామలక్ష్మికి రూ.30,028 సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళి, బిఎస్ఎంకె జోగి నాయుడు, ఉగ్గిన రమణ మూర్తి, పచ్చికూర రాము, తలారి కాశీ నాయుడు, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, వేగి గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-మునగపాక

మండలంలోని గంగాదేవిపేట గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబర్ కాండ్రేగుల నరసింహనాయుడు తమ అనుచరులతో కలిసి బుధవారం రాత్రి ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నరసింహనాయుడుతో పాటు వార్డు మెంబర్ వాకపల్లి నూకాలమ్మ, దేవస్థానం చైర్మన్ బాబ్జి తదితరులకు విజయ్‌కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, అనకాపల్లి ఆవకాలువ చైర్మన్ జెకె నాయుడు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు ఆడారి జనార్ధన్, గంగాదేవి పేట సీనియర్ నాయకులు కాండ్రేగుల నాగేంద్ర, జనసేన నాయకులు కాండ్రేగుల గాంధీ, బొడ్డేడ అప్పల నాయుడు, వేగి కృష్ణ, గ్రామ టిడిపి అధ్యక్షులు పెంటకోట మహేశ్వరరావు, కార్యదర్శి కొలుసు వెంకట అప్పారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ పోస్టుల దరఖాస్తుకు తుది గడువు నేడే

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏడాది పాటు ఒప్పంద ప్రాతిపదికన పని చేయడానికి విశాఖ జోన్ పరిధిలో ఖాళీ స్టాఫ్ నర్స్ పోస్టుల దరఖాస్తుకు ఈనెల 17వ తేదీ తుది గడువు అని వైద్య ఆరోగ్య శాఖ విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పి రాధారాణి గురువారం ఒక ప్రకటన తెలిపారు. వాస్తవానికి చివరి తేదీ ఈ నెల 15 అని, అయితే పండగల నేపథ్యంలో తేదీ పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బోయిల కింతాడలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో గ్రామ సర్పంచ్ బూరె బాబురావు ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్ర పరిచే విధంగా చర్యలు చేపట్టారు. గ్రామంలో పేరుకుపోయిన మురుగును పారిశుధ్య కార్మికులతో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిసరాలను పరిశుభ్రం చేసి ప్రజలు ఎటువంటి అనారోగ్యాలకు గురి కాకుండా మంచి పరిపాలన అందిచడమే గ్రామ పంచాయతీ ధ్యేయమని చెప్పారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి-మునగపాక

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, వెంకటాపురం మాజీ ఉప సర్పంచ్ గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వెంకటాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రమాబాయి యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానికులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ అంబేద్కర్‌పై అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్‌షా, ప్రధాని నరేంద్ర మోడీ అందుకు బాధ్యత వహించడానికి, దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు సిద్ధపడకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. అమిత్ షాకు రాజ్యాంగం మీద గాని, అంబేద్కర్ మీద గాని గౌరవం లేదని, అందుకే అంబేద్కర్ పట్ల ఆయన అగౌరవంగా మాట్లాడారని పేర్కొన్నారు. రాజ్యాంగంపైనా, అంబేద్కర్‌పైనా మోడీకి గౌరవం ఉంటే తక్షణమే మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మనుధర్మాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ నామాన్ని స్మరించవద్దని అమిత్ షా పార్లమెంట్లో వ్యాఖ్యానించారని, మనుధర్మం, కుల ధర్మాలకు వ్యతిరేకంగా పోరాడాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ రేబాక బాబురావు, బలిరెడ్డి సింహాచలం, పాలిక రాంబాబు, ఆర్ సూరిబాబు, ఆర్ రమణ, ఆర్ అచ్చమ్మ, ఆర్ రవణమ్మ, ఓ నాగేశ్వరరావు, కే రామ్ చరణ్, రేబాక వెంకటేష్, సిహెచ్ నారాయణరావు, ఆర్ ప్రసాద్, సిహెచ్ సత్యరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వెంకటాపురం గ్రామస్తులు

ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలు జనవరి 18వ తేదీన అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని మండలాలు, గ్రామాలు, పట్టణాల్లో వర్ధంతి సందర్భంగా వైద్య శిబిరాలు, అన్నదానం, వస్త్ర దానం, రోగులకు పండ్లు రొట్టెల పంపిణీ, విద్యార్థులకు పుస్తకాలు, రైతులకు టార్పలిన్ పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. శాసనసభ్యులు, నియోజవర్గ ఇన్‌ఛార్జులు, కార్పొరేషన్ల చైర్మన్లు, అన్ని స్థాయిలో పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు వీటిని చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

కసింకోట సబ్ స్టేషన్ 132/33 కేవీ మరమ్మతుల కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో ఉన్న 33/11 కెవి కొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు గృహ అవసరాల విద్యుత్, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎపిఇపిడిసిఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావునా 33/11 కెవి కొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం, సంపతిపురం, వేట జంగాల పాలెం, కూండ్రం, కుంచంగి, రొంగలి వానిపాలెం, పిసినికాడ గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలాగే తుమ్మపాల 132 కేవీ సబ్స్టేషన్ మరమ్మతుల కారణంగా తుమ్మపాల సెక్షన్ పరిధిలోని తుమ్మపాల, అల్లిఖానుడిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో 17వ తేదీ ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు 24 గంటల వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందని వెల్లడించారు.

ఉప్పవరంలో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని ఉప్పవరం గ్రామంలో సీతారాముల వారి తీర్థ మహోత్సవం సందర్భంగా గురువారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు, గ్రామ ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ సర్పంచ్ పిన్నమరాజు వాసు, జనసేన పార్టీ అధ్యక్షులు చిన్ని దొరబాబు, మాజీ ఉపసర్పంచ్ అడపా మహాలక్ష్మి నాయుడు, కాయల వసంతరావు సతీష్ సలీం పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల తదితరులు

25న గవరపాలెం

గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్రలో ప్రతిష్టాత్మకమైన అనకాపల్లి గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఈ జనవరి 25న అత్యంత వైభవంగా జరగనుంది. ఈ ఉత్సవ కార్యక్రమాల తొలి కరపత్రాన్ని గురువారం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, రామకృష్ణకి ఉత్సవ విశేషాలు తెలియజేశారు. ఈ సంవత్సరం 45 కార్యక్రమాలలో 37 భారీ స్టేజిలు, కలకత్తా వారి లైటింగ్, బాణాసంచా, ఉచిత వైద్య శిబిరాలతో అత్యంత భారీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారిని దర్శించి రథయాత్రను ప్రారంభించాలని కోరగా ఎమ్మెల్యే రామకృష్ణ స్పందిస్తూ తన సహాయ సహకారాలు తప్పకుండా ఉంటాయని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా క్షేమంగా ఇంటికి తిరిగి చేరుకునేలా పోలీస్, జీవీఎంసీ, విద్యుత్, ఆర్‌టీసీ, ఫైర్, వైద్య అధికారులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మీనాయుడు, సంయుక్త కార్యదర్శి పి.వి.రమణ, జనసేన నాయకులు పీలా నాగ శ్రీను, కొణతాల మాధవ, దాడి బుజ్జి, ఉత్సవ ప్రతినిధులు కాంగ్రెసుల విశ్వేశ్వరరావు, బుద్ద రాజేష్, పొలిమేర రవి, గండేపల్లి మురళి, కొణతాల ప్రసాద్, కొణతాల రవి, భీశెట్టి ప్రసన్న, కొణతాల మురళి, పెంటకోట లక్ష్మీనారాయణ, కోరిబిల్లి ఉదయ్, దొడ్డి జీవన్, దొడ్డి జగన్నాథరావు, విల్లూరి రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొద్దపు ప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ 83వ డివిజన్ ఇన్‌ఛార్జి బొద్దపు ప్రసాద్ జన్మదిన వేడుకలు గురువారం స్థానిక వేల్పుల వీధి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, సినీ నటులు ప్రసన్న కుమార్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదంశెట్టి నీలబాబు, పోలవరపు త్రినాథ్, బొడ్డేడ జోగి నాయుడు, కాయల మురళీధర్, గొంతిన శ్రీనివాసరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, వాకాడ బాబు, గొర్లి శేఖర్, చెక్కల శీను, సందిన చిన్నబాబు, పైలా గోపి, మాజీ సైనికులు జి.నూకరాజు, రవిశంకర్, రాజు, ఉమామహేశ్వరరావు, షేక్ రియాజ్, వాకాడ మదన్, దొండ నాగు, పార్టీ సీనియర్ నాయకులు, బంధువులు పాల్గొన్నారు.

స్కిల్ కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు స్కిల్ డెవలప్మెంట్ కేసులో సుప్రీంకోర్టులో ఊరట లభించడం పట్ల మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా అన్యాయంగా ఆధారాలు లేని స్కిల్ కేసును చంద్రబాబుపై బనాయించి 53 రోజులు జైల్లో పెట్టారని గుర్తు చేశారు. హైకోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని వేసిన కేసులో సుప్రీంకోర్టు జగన్ కేసు కొట్టి వేయడం ఆయనకు చెంప పెట్టని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో చంద్రబాబు నాయుడుపై వేసిన కేసులు ఎక్కడ రద్దు చేస్తారోనన్న ఆందోళనతో జగన్ రెడ్డి కొంతమంది జర్నలిస్టులకు డబ్బులు ఇచ్చి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేసులు వేయించినా చట్టం ముందు నిలబడలేదని, నిజం గెలిచిందని వెల్లడించారు. వైసిపి దిక్కుమాలిన ప్రయత్నాలతో కోర్టు ముందు నవ్వుల పాలు అయిందని నాగ జగదీష్ మండిపడ్డారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులు, సోషల్ మీడియా పోస్టులు వంటివి మాని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రహదారి భద్రతా మాసోత్సవాలను చిత్తశుద్ధితో నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి
- పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పకడ్బందీగా, చిత్తశుద్ధితో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. ఈ నెల 17 నుండి జరుగు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025 పోస్టర్లను, కరపత్రాలను గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జెసి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై రవాణా, పోలీసు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు చాలా ముఖ్యమైనవన్నారు. ప్రమాదాల వల్ల ఒక ప్రాణాన్ని పోగొట్టుకున్నా తిరిగిరాని పరిస్థితి ఉందని, ఇతరుల పొరపాటు వల్ల ప్రాణాలు కోల్పోవచ్చని, ప్రమాదాలు జరుగకుండా సురక్షిత డ్రైవింగుపై అందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. రహదారి భద్రత కార్యక్రమాలు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా చేపట్టాలన్నారు. జిల్లాలో జనవరి 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఈ మాసోత్సవాలు చేపట్టాలన్నారు. ఈనెల 17వ తేదీన రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్స్ట్రక్టర్స్, రిటైర్డ్ ఏపీఎస్ఆర్టీసీ సిబ్బందితో వాలంటీర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు మద్యం సేవించి వాహనం నడిపే వారిని గుర్తించడం, అధిక వేగంతో నడిపే వాహనాలను స్పీడ్ గన్‌తో గుర్తించడం, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ మొదలైన వాటిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఈనెల 22 నుంచి 23వ తేదీ వరకు జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేయడం చేసి అక్కడ తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జివిఎంసి అనకాపల్లి జోనల్ పరిధిలో కూడా బ్లాక్ స్పాట్లలో పరిశీలన చేయాలన్నారు. ఈనెల 24వ తేదీన డ్రైవర్లకు హెల్త్ చెకప్ చేయించడం, 25వ తేదీన అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, 26, 27వ తేదీలలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి వాకథాన్‌లు నిర్వహించడం, 30, 31వ తేదీలలో బైక్ ర్యాలీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వచ్చే నెల 15వ తేదీ వరకు రహదారి భద్రత మాసోత్సవాలలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్, అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం వెంకట నారాయణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, రవాణా, పోలీస్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి జాహ్నవి, అధికారులు

గోవాడ సుగర్స్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు గత నాలుగు నెలల నుంచి బకాయి పడ్డ 6 కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలోని పర్మనెంటు, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఓచర్ పేమెంట్, కార్మికులకు సుమారు 352 మందికి జీతాలు లేక అల్లాడిపోతున్నారని తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని కార్మికులకు బకాయి పడ్డ ఆరు కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పండగ పూట కూడా కార్మికులకు వేతనాలు లేకుండా పస్తులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఫ్యాక్టరీని ఆధునికీకరించి రైతులు, కార్మికుల బకాయిలు లేకుండా చేస్తామని చెప్పిన మాటలు నేటికీ నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు తమ మాట నిలబెట్టుకోవాలన్నారు. లేనట్లయితే గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శంకరరావు, చిత్రంలో ఈశ్వరరావు

మజ్జి మీనా కుటుంబానికి పంచకర్ల పరామర్శ

ప్రజాశక్తి-యలమంచిలి : ప్రమాదవశాత్తూ ఇటీవల మరణించిన యలమంచిలి మున్సిపాలిటీ 24వ వార్డు మాజీ కౌన్సిలర్ మజ్జి మీనా కుటుంబాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం పరామర్శించారు. కొక్కిరాపల్లిలోని మీనా స్వగృహానికి వెళ్లి ఆమె భర్త మజ్జి వీరబాబు, ఇతర కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. ఎమ్మెల్యే పంచకర్ల వెంట కూటమి నాయకులు ఉన్నారు.

మీనా కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పంచకర్ల

గ్రామాల్లో ఘనంగా తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని బంగారమ్మ పాలెం, గొల్లలపాలెం, బలిజపాలెం, ఎరుకునాయుడుపాలెం, పెదనాయుడుపాలెం గ్రామాలలో సీతారాముల తీర్థ మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు పెదనాయుడుపాలెం గ్రామంలో శ్రీకోదండ సీతారామ, సత్యనారాయణ సంతోష్ మాత తీర్థ మహోత్సవం గ్రామ పెద్దలు గొర్లి శ్రీనివాస్, సబ్బవరపు సత్యనారాయణ (బుజ్జి) లాలం సతీష్ కన్నా, కిల్లి వెంకట సత్యనారాయణ, గొల్లు రమణ, సబ్బవరపు నాగభూషణం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కర్రి సత్యనారాయణ, సబ్బవరపు నాగేంద్ర కుమార్, కిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని మారేపల్లిలో శ్రీరాముల వారి తీర్థం, ఎం.అలమండలో ముత్యాలమ్మ, రైవాడలో ఏరకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు గురువారం జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, గ్రామ దేవతలను దర్శించుకున్నారు. ఏరకాలమ్మ అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, గ్రామ సర్పంచ్ చల్లా లక్ష్మి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో టిడిపి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ, రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గోర్రపోటు రామ్మూర్తినాయుడు, ముషిడిపల్లి మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, చల్లా నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శివారు గరుగుబిల్లి, గొండుపాలెం గ్రామాలలో గురువారం శ్రీ దండు ముత్యాలమ్మ అమ్మవారిల తీర్థమహోత్సవాలు ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. డబ్బులు, సన్నాయి మేళాలు, తప్పుడు గుళ్ళు, కోలాటాల మధ్య ఈ పండగలు జరిగాయి. మధ్యాహ్నం, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తీర్థ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గురువారం నలమారమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఘనంగా సాగింది. అమ్మవారిని పసుపు కుంకుమలతో పూజలు చేశారు. మహిళలు వేసిన కోలాట ప్రదర్శనలు అలరించాయి. అమ్మవారి ఆలయ ఆవరణలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కోలాట బృంద సభ్యులకు గ్రామానికి చెందిన ఎస్.జగ్గప్పారావు, వై గోవిందా ఆర్థిక సహాయంతో సమకూర్చిన కోలాటం చిడతలను గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు, సీనియర్ పాత్రికేయుడు ఆడారి సాంబశివరావు, గ్రామ ఉప సర్పంచ్ భీశెట్టి రాము చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మరాజుపేట పిఎసిఎస్ కార్యదర్శి ఐఎస్ మహేశ్వరరావు, జన మిత్ర బ్యాంక్ మేనేజర్ ఐఆర్‌వి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముందుకు సాగని రహదారి పనులు

గోతులు పడిన రహదారి

ప్రజాశక్తి-కోటవురట్ల:కూటమి ప్రభుత్వం సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారి నిర్మాణం చేపడుతున్నట్టు ఆర్భాటపు ప్రకటనలకు ఎక్కడా అడుగులు ముందుకు పడలేదు. అన్నవరం రహదారి శిథిలావస్థకు చేరుకొని దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నా నేటికీ నిధులు కూడా మంజూరు కాలేదు. దీంతో తారురోడ్డు కాస్త మట్టిరోడ్డుగా తయారయింది. గత ప్రభుత్వం రహదారుల నిర్మాణాలు పట్టించుకోక పోవడంతో గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అయినా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తుందని ఇటీవల ప్రభుత్వ ప్రకటనతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేసినా కార్యరూపం దాల్చలేదు. సంక్రాంతి నాటికి పనులకు అడుగులు పడతాయిన గ్రామస్తులు ఎదురుచూశారు. రోడ్డు నిర్మాణానికి గతంలో 90 లక్షలకు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరు కాలేదు. మరల దాదాపు 1.30 కోట్లతో అంచనాలకు రూపొందించినట్లు డిఈ కుమార్ రాజా తెలిపారు. నిధులు మంజూరు అయిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు.

కోతుల స్వైరవిహారం

-భయాందోళనలో వాహనదారులు, పాదచారులు

రోడ్డుపైన కోతులు

ప్రజాశక్తి మాడుగుల: గత కొద్దిరోజులుగా రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులను, రైతన్నలను కోతులు భయాందోళనకు గురి చేస్తున్నాయి. మాడుగుల మండలం కేజే పురం- దబ్బగుంట రహదారిలో గత కొంతకాలంగా వానరులు బీభత్సం సృష్టించడంతో అటుగా రాకపోకల సాగించే ప్రయాణికులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

మాడుగుల తాచేరుకాలవ నుండి కేజే పురం వెళ్లే రహదారిలో వానరులు గుంపులు గుంపులుగా ఉండడంతో పాటు రోడ్ల పైన సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా పాఠశాలలకు, కళాశాలలకు వచ్చే విద్యార్థులు, పొలానికి వెళ్లే రైతన్నల క్యారీ బ్యాగులను లాక్కొని చిందరవందర చేస్తున్నాయని భయాందోళనకు గురవుతున్నారు. వీటి నుంచి రక్షణ కల్పించే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాలీబాల్, క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో వంజర పంచాయితీ కిముడుపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు, యూత్ లీడర్ ఖాన్ ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్. నిర్వహించి తన సొంత ఖర్చులతో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు, 42 టీములు పాల్గొనగా, అందులో గెలుపొందిన టీముకు మొదటి బహుమతి 7000 రూపాయలు నగదును రెండవ బహుమతి మూడు వేలు, సీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కే ప్రకాష్, వార్డ్ మెంబర్ గిరిబాబు, పిసా చట్టం వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బహుమతిని ఇస్తున్న నాయకులు

వాలి పోయిన విద్యుత్ స్తంభం వద్ద మాట్లాడుతున్న నాయకులు, స్థానికులు

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

-సరి చేయాలని సిపిఎం నేతలు, గిరిజనులు వేడుకోలు

ప్రజాశక్తి- చీడికాడ: ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి దేముడునాయుడు, గిరిజనులు డిమాండ్ చేశారు. మండలంలోని కొండ్లకొత్తూరు గ్రామంలో విద్యుత్ స్తంభం రోడ్డు పక్కనే ఉంది. ఈ విద్యుత్ స్తంభం ఇంటి పైన వాలి పోయింది. ఈ స్తంభం పడి పోయి ఎప్పుడు ఎవరి ప్రాణాలు తీసుకుంటుందోనని బిక్కుబిక్కుమని గ్రామంలోని ప్రజలు ఆందోళన చెందున్నారు. గతంలో కూడా ఒక విద్యుత్ స్తంభం విరిగి పడిపోవడంతో ఆరు మేకలు, నాలుగు ఆవులు, రెండు ఎడ్లు మరణించాయి. ఇప్పుడు కూడా ఈ విద్యుత్ స్తంభం ఎవరి మీద ఎప్పుడు పడి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే స్తంభాన్ని వేరొక స్థానంలోకి మార్చి తమ ప్రాణాలు కాపాడాలని సిపిఎం నేతలు, గిరిజనులు వేడుకుంటున్నారు.

బహుమతులు అందజేస్తున్న ఎంపిపి

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామంలో రామకోవెల వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, పండగలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పిల్లల్లో నైపుణ్య పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాతలవాని చెరువు నీటి సంఘం అధ్యక్షులు మలసాల రమణాజీ, వైస్ ప్రెసిడెంట్ నాయుడు, నూకరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రావిమతం:మండలంలో కవగుంట గ్రామంలో సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు పలు సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ దాసరి సూర్య కుమారి తెలిపారు. రాజన్న యువత ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మహిళల కు ముగ్గుల పోటీలు, డాన్స్, స్పూన్ గేమ్, ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేయడం జరిగిందన్నారు. గత నాలుగేళ్ల నుంచి ప్రతి ఏడాది గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు చేపూరి నాగేశ్వరావు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బహుమతిని ఇస్తున్న సర్పంచ్

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి- మాడుగుల:రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు మాడుగుల, చీడికాడ మండలాల్లో అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిబిరాలలో పశువులకు, దూడ పెయ్యలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేస్తామన్నారు. గ్రామాలలో ఉన్న గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. అనారోగ్యంగా ఉన్న, ఎదకురాని, గర్భకోశ వ్యాధులున్న పశువులకు ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ప్రతి మండలంలో రోజుకు 2 గ్రామాలలో ఈ శిబిరాలు నిర్వహిస్తామని, ఇందుకు రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆలయానికి పావు కిలో వెండి వితరణ

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం కోడూరు మోదకొండమ్మ అమ్మవారికి అదే గ్రామానికి క్రీర్తిశేషులు గొల్లవిల్లి వరాహమూర్తి, నాగమణి దంపతుల కుమార్తెలు పైడి శ్రీ లలిత, సుష్మ శ్రీలక్ష్మిలు పావు కిలో వెండిని ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు గురువారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, రాయపురెడ్డి కొండలరావు, జల్లి హరిప్రసాద్, కోన అప్పలనాయుడు, జాజిమొగ్గల చిరంజీవి, సేనాపతి సముద్రం, జొన్నపిల్లి నాగరాజు, కలిమి శివ, బొడ్డు నానాజీ పాల్గొన్నారు.

చింతపల్లి ఎఎస్‌పిగా నవజ్యోతి మిశ్రా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ఏఎస్పీగా నవజ్యోతి మిశ్రా గురువారం ఏఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన నవజ్యోతి మిశ్రా 2021 బ్యాచ్ ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. గతంలో గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్ గా విధులు నిర్వహించారు. ఇంత వరకు ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన "షేక్ షహబాజ్ అహ్మద్ సెలవుపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ మాట్లాడుతూ, గంజాయి సాగు, రవాణా నిరోధించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటానన్నారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. పర్యాటక ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏఎస్పిని పోలీస్ శాఖ సిబ్బంది, పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ఎఎస్‌పిని అభినందిస్తున్న సిబ్బంది

అయోమయంలో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు

-వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించనున్నట్లు సిఎం ప్రకటనపై ఆందోళన

-గత వైసిపి హయాంలో పూర్తిగా నిర్వీర్యం

-కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు అడియాశలేనా..

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :రాష్ట్ర ప్రజలకు వాట్సాప్ ద్వారానే వివిధ రకాలు సేవలందిస్తామని సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలపడంతో మీసేవ కేంద్రాల యాజమాన్యాలు అయోమయంలో పడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలు, గవర్నమెంట్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పడంతో మీ సేవ నిర్వాహకులు ఆందోళనకు గురవుతున్నారు.

జనవరి 18 నుంచి ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. తొలుత 150 రకాల సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తామని వెల్లడించారు. ఇకపై ప్రజలకు చేతిలోని సెల్ ఫోనే ఆయుధమన్న చంద్రబాబు.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్రబాబు మీ సేవా కేంద్రాలను ప్రవేశపెట్టారు. ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించేలా వీటిని తీర్చిదిద్దారు. విద్యార్థులకు ధృవీకరణపత్రాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఓటరు కార్డుల్లో మార్పులు చేర్పులు, ఇంటి, నీటి పన్నులు. విద్యుత్ బిల్లులు ఇలా పలు రకాలుగా మీ సేవా కేంద్రాలు ద్వారానే సేవలు అందేవి. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకు రావడంతో మీ సేవా కేంద్రాలు చాలా వరకు మూతపడ్డాయి. సచివాలయాలు ఏర్పడిన తొలినాళ్లలో మీ సేవా కేంద్రాల్లో ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లవని అధికారులు కూడా సచివాలయాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వం కూడా మీసేవా కేంద్రాలను పరిగణనలోకి తీసుకోరాదని హెచ్చరించడంతో అధికారులు కూడా మీసేవలను దూరం పెట్టారు. దీంతో మీ సేవలకు ప్రజలు కూడా దూరమయ్యారు. ఈ క్రమంలో మీసేవా కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్థిక ఇక్కట్లతో కొందరు కేంద్రాలను నడపలేక మూసివేశారు. అంతంత మాత్రంగా ఉన్న సర్వీసులతో ఆదాయం లేక ఆపరేటర్లు నానా అవస్థలు పడుతున్నారు. అటు నడపలేక, ఇటు మూసివేయలేక అయోమయంలో పలువురు ఉన్నారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం మీసేవలకు పూర్వ వైభవం తీసుకు వస్తుందని నిర్వాహకులు ఆశగా ఎదురు చూస్తున్న సమయంలో పండుగ వేళ ఈ విషయం తెలియడంతో ములుగుతున్న నక్కపై తాటికాయపడినట్లు అయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రజలకు పౌరసేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ టీసీఎస్ భాగస్వామ్యంలో మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమయంలోనే దశల వారీగా మీ సేవా కేంద్రాల్లో టెక్నాలజీ ఆధారిత పౌరసేవలు అందుబాటులోకి వచ్చాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్, యువగళం పాదయాత్రలో లోకేశ్ గత ఎన్నికలకు ముందు కలిసిన మీ సేవా ఆపరేటర్లకు మీ సేవలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో మీసేవలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చూసి నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.ప్రభుత్వం వాట్సప్ ద్వారా సేవలందిస్తే రోడ్డున పడతామని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్తమల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. ముందుగా వారు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఒకరికొకరు అలనాటి విషయాలను గుర్తుకు తెచ్చుకొని సందడి చేశారు. అనంతరం సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

ప్రోత్సాహక బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో గుడ్డిప గ్రామానికి చెందిన 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం మండల విద్యాశాఖ అధికారి తలుపులు చేతులు మీదుగా నగదు ప్రోత్సాహక బహుమతులను ప్రధానం చేయడం జరిగిందని సర్పంచ్ గుమ్మాల గణేష్ తెలిపారు. గుడ్డిప గ్రామంలో గురువారం రాముల వారి తీర్థ మహోత్సవం సందర్భంగా బహుమతులను అందజేశామన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, ఇదే విధంగా ప్రతి ఏడాది విద్యార్థులను ప్రోత్సహించినట్లయితే చదువుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5000, 3000, 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన వారికి రూ.4000 వేలు, 2000 ఆర్థిక సహాయాన్ని అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

నక్కపల్లిలో నంది ఉత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో నంది ఉత్సవాన్ని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది కనుమ మరుసటి రోజున నంది ఉత్సవం చేయడం ఆనవాయితీగా వస్తుంది.. దీనిలో భాగంగా నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న నంది విగ్రహాన్ని పలువురు భక్తులు దర్శించుకున్నారు. తప్పుడు గుళ్ళు ప్రదర్శన ఆకట్టుకుంది. నంది ఉత్సవం సందర్భంగా తీర్థం జరిగింది. చిన్న చిన్న దుకాణాలు వెలసాయి. తీర్థంలో చిరువ్యాపారులు బొమ్మలు, ఆట వస్తువులు తదితర సామాగ్రి అమ్మకాలు చేపట్టారు. చుట్ట ప్రక్కల గ్రామాల నుంచి పెద్దలు, యువకులు, పిల్లలు తరలివచ్చి తీర్థంలో సందడిచేసారు. పిల్లలు ఆట వస్తువులు కొనుగోలు చేసారు. నంది ఉత్సవం పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో విద్యుదీకరణ చేపట్టారు. భారీ మందు గుండు సామాగ్రి పేల్చారు.

ఘనంగా తీర్థం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సీహెచ్. నాగాపురం గ్రామంలో గురువారం తీర్థ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా తీర్థంలో రంగుల రట్నాలు, పిల్లల బొమ్మల విక్రయాలు జోరుగా సాగాయి. ఈ తీర్థ మహోత్సవంలో ప్రత్యేక భజనలు, కోలాటాలు నిర్వహించారు.

కెఇఎ నూతన కార్యవర్గం ఎన్నిక

-అధ్యక్షులుగా వీర ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా గట్టా వరప్రసాద్

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియేషన్ (కెఇఎ) నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.గురువారం కొత్తకోట లో అసోసియేషన్ సర్వ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె ఈ ఏ వ్యవస్థాపకులు గట్రెడ్డి రాంబాబు . అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా పైల సత్యనారాయణ అధ్యక్షులుగా అంగజాల వీర ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా గట్టా వరప్రసాద్, ఉపాధ్యక్షులు గా జాలిపర్తి నిరంజన్, ట్రెజరర్ గా శ్రీ కేదారి శెట్టిబుజ్జి, కన్వీనర్ మరియు సలహాదారుడుగా కేదారిశెట్టి గుప్తాజీ, కార్యదర్శులుగా గుమ్మడు కన్నయ్య దొర, బేరా సతీష్ కుమార్, ఐటీ సెల్ కార్యదర్శిగా దంగేటి సాయిరామ్, యూత్ సెక్రటరీగా కోట ప్రవీణ్ (బాబి), సీనియర్ సలహాదారుగా చిత్రాడ అప్పారావు తదితరులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం మరి న్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామంలో విద్యాభివద్ధికి, సంక్షేమానికి తోడ్పడాలని పలువురు విద్యావేత్తలు మరిసా బాబురావు, పులిగా శంకరరావు, బుంగా రమణాజీ,తరిపే ఈశ్వరరావు, ఎర్ర శివ, గుమ్మడి వాసు ఆకాంక్షించారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు, ఇన్‌సెట్‌లో వీర ప్రకాష్, వరప్రసాద్,

అస్తవ్యస్తంగా రహదారి

రాళ్లు తేలిన రహదారి

ప్రజాశక్తి-అరకులోయ:ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్పటికీ అవి ప్రకటనలకే పరిమితమవుతున్నాయి తప్ప ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. దీంతో అల్లూరి మన్య ప్రాంతంలో అనేక గ్రామాలకు రహదారులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు ఉన్న ప్రాంతంలో నిర్మించిన రోడ్ల మరమ్మత్తులకు గుర్రై పట్టించుకోని నాథుడు కరువడంతో రహదారులు రాళ్ల తేలాయి.

మండలంలోని సుంకరమెట్ట సమీపములోని గన్నెల జంక్షన్ రహదారి మరమ్మతు గురి అయ్యింది. దశాబ్దాల కిందట వేసిన రహదారి నిర్వహణ లేక రాళ్ల తేలిపోయాయి. అప్పట్లో ఈ రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్, అధికారులు అక్రమాలకు పాల్పడి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఈ రోడ్డు నిర్మించడంతో వేసిన కొద్ది నెలలకే మొదటి స్థితికి చేరుకుంది. అప్పటినుంచి ఎటువంటి మరమ్మత్తులు చేపట్టక పోవడంతో రాళ్ల తేలి ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. కొత్త బళ్ళు గూడ, సుంకరమెట్ట, గన్నెల, లోతేరు, కోనాపురం, బొండం, బొర్రా ఇరగాయి, పంచాయతీల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ఈ రోడ్డును అధికారులు నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆదివారం సుంకరమెట్టలో వారపు సంత జరుగుతుండడంతో ఎక్కువమంది గిరిజనులు లారీలు, వ్యానులు, జీపుల్లో ఈ రోడ్డు మార్గంలో వెళుంటారు.

గన్నెల జంక్షన్ సమీపంలోనే సిమిలిగూడ రైల్వే స్టేషన్ ఉండడంతో రైలు ప్రయాణికులు కూడా ఈ మార్గంలోనే ప్రయాణించవలసి వస్తుంది. రాళ్ల తేలి ప్రమాదకరంగా మారిన ఈ రహదారిను బాగు చేయాలని ఎన్ని మార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆయా ప్రాంతాల గిరిజనులు వాపోయారు. వాహన చోదకులు, గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుని వెంటనే బాగు చేయాలని గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

జూదాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-చీడికాడ:తీర్థ మహోత్సవాల సందర్భంగా గ్రామాలలో కోడి పందాలు, పేకాట, బల్లాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సతీష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాలలో జరిగే ఉత్సవాలలో బాగంగా కోడిపందాలు, పేకాటలు, రికార్డింగ్ డాన్సులు, బల్లాటలు, గుళ్ళఆటలు ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేపట్ట వద్దన్నారు. ఈ కార్యక్రమాలు చేపడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.

రబీ సాగుకు సన్నద్ధం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలో పలు గ్రామాల్లో రైతులు రబీ సాగుకు ఏర్పాటు చేస్తున్నారు. గత వారం రోజులు గా పంట పొలాలను దమ్ములు చేస్తున్నారు. వరి నాట్ల వేయడానికి వరి ఆకులను తీస్తున్నారు. గత వారం రోజులుగా వడ్డాది, బంగారుమెట్ట, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో వరి ఆకులు తీసి నాట్లు వేస్తున్నారు. సాగు నీటి అవకాశాలు, వ్యవసాయ మోటార్లు, వ్యవసాయ బావులు వున్న రైతులు వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

వరి నారు తీస్తున్న మహిళా రైతులు